సాక్షి సంగారెడ్డి

శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



కమ్మనైనది అమ్మభాష

తెలుగుభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెబుతున్నారు కవులు, కళాకారులు, రచయితలు.

వివరాలు 8లో ▸



అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

పల్లాడియం కార్బన్ దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగలను జిల్లా పోలీసులు అరెస్టు చేశారు.

వివరాలు 8లో ▸



శివరాత్రికి ఆలయం ముస్తాబు

ప్రముఖ శైవక్షేత్రం జీరంగూడలోని భ్రమరాంబమల్లికార్జున ఆలయం మహాశివరాత్రికి ముస్తాబైంది.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న అంజిరెడ్డి

వట్‌పల్లి(అందోల్): ఎమ్మెల్సీ ఎన్నికల్లో మేధావులంతా కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పి తనకు అండగా నిలవాలని నిజమాబాద్, మెదక్, కరీంనగర్, అదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి కోరారు. వట్‌పల్లిలో పట్టభద్రులు, ఉపాధ్యాయులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అబద్ధపు హామీలు ఇచ్చిన కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కు లేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల, నిరుద్యోగుల పక్షాన శాసన మండలిలో ప్రభుత్వాన్ని ప్రశ్నించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తిరెడ్డి, సాధారణ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మఠం చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలను అణచలేరు



ధర్నాలో పాల్గొన్న ప్రజలు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్రజా ఉద్యమాలను నిర్బంధాలతో అణచివేయాలని చూస్తే ప్రజలు మరింత తిరగబడతారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు హెచ్చరించారు. ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డ్‌ను రద్దు చేయడం గురించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచించాలన్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని గురువారం కేవల్‌కిషన్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైటాయించి ధర్నా చేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి గుమ్మడిదల, నల్లవల్లి, ప్యారానగర్ ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ... ప్యారానగర్‌లో డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని 17 గ్రామాలకు చెందిన 40 వేల మంది ప్రజలు ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నారన్నారు. స్థానిక ప్రజల అభిప్రాయాలకు భిన్నంగా ఏకపక్షంగా డంపింగ్ యార్డ్ ఏర్పాటును ప్రభుత్వం పునరాలోచించుకోవాలని సూచించారు. తక్షణమే పోలీస్ పికెట్‌ను ఎత్తివేసి పోలీసుల్ని వెనక్కి రప్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, రాజయ్య,మాణిక్యం, సాయిలు, నర్సింహులు పాల్గొన్నారు.

1.08 కోటి రుద్రాక్షలతో మహాశివలింగం



మాట్లాడుతున్న మహేశ్వర శర్మ

సంగారెడ్డి టౌన్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈనెల 26న 1.08 కోటి రుద్రాక్షలతో ఫసల్వాదిలోని ఆశ్రమంలో మహాశివలింగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ డాక్టర్ మహేశ్వర శర్మ సిద్ధాంతి తెలిపారు. సంగారెడ్డి మండలం ఫసల్వాదిలోని ఆశ్రమంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ...ప్రపంచంలోనే తొలిసారిగా రుద్రాక్షలతో శివలింగాన్ని తయారు చేశామన్నారు. శివలింగం 18.50 అడుగుల ఎత్తు ఉంటుందని ఈ నెల 23న తమ ఆశ్రమంలో దీనిని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. శివలింగానికి భక్తులు అభిషేకం చేసే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గతేడాది 18 అడుగుల భస్మ శివలింగాన్ని తయారు చేసినట్లు గుర్తు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో మహాశివరాత్రికి పాల్గొనాలని తెలిపారు. సమావేశంలో విద్యాపీఠం సభ్యులు తోపాజి అనంత కిషన్, ప్రశాంత్ కుమార్, సంజయ్ కుమార్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయల అసిస్టెంట్ ఈఓగా అంజయ్య

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల అసిస్టెంట్ ఈఓగా అంజయ్యను నియమిస్తూ దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కొండగట్టు అంజనేయస్వామి ఆలయ ఈఓగా పనిచేస్తూ జనవరి 31వ తేదీన పదవీ విరమణ చేసిన అంజయ్యను అసిస్టెంట్ ఈఓగా రెండేళ్ల కోసం నియమించారు.

ఆవేశం



అంగోతు దశరథ్ (26).. నిజాంపేట్ నాగ్‌ధర్ పరిధిలోని రాంచెందర్ తండాకు చెందిన ఇతడు స్థానిక చెరుకు ఫ్యాక్టరీలో లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తన కూతురితో చనువుగా ఉంటున్నాడన్న కారణంతో దశరథ్‌ను మేఘ్యానాయక్ తండాకు చెందిన నేనావత్ గోపాల్ దారుణంగా హత్య చేశాడు. రెండు రోజుల అనంతరం తానే హత్య చేశానంటూ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. ఈ హత్య కేసులో గోపాల్‌కు సహకరించిన అతడి భార్య, చదువుకుంటున్న కూతురు, కుమారుడు జైలుపాలయ్యారు. ఇక హత్యకు గురైన దశరథ్ కుటుంబం రోడ్డున పడింది. రెక్కల కష్టంపై జీవించే వీరు దశరథ్ మరణంతో ఐదు నెలల గర్భవతి అయిన భార్య సోనీబాయి, ఇద్దరు పిల్లల పరిస్థితి అగమ్యమైంది. దశరథ్ చేసిన తప్పు... గోపాల్ ఆవేశం ఇరు కుటుంబాలను అంధకారంలోకి నెట్టేశాయి. ఆవేశం, అనాలోచిత నిర్ణయాలకు ఈ కేసు ఓ ఉదాహరణ.

అనుమానం



హెబిశె చంద్రమ్మ. కంగ్టి మండలం తుర్కవడ్‌గాం గ్రామానికి చెందిన ఈమె తన భర్త గుండప్ప తప్పతాగి అనుమానంతో రోజూ వేధింపులకు గురయ్యేది. పలుమార్లు గ్రామంలో పంచాయితీ సైతం పెట్టగా గుండప్పదే తప్పని పెద్దలు మందలించారు. అయినప్పటికీ గుండప్ప అనుమానం పెనుభూతమై భార్య చంద్రమ్మను దారుణంగా గొడ్డలితో నరికి చంపేశాడు. ఇద్దరూ వ్యవసాయకూలీలైన గుండప్ప, చంద్రమ్మలకు నలుగురు సంతానం. పెద్ద కూతురుకి వివాహం కాగా మరో కూతురు బీఫార్మసీ, కొడుకు ఐటీఐ, మరో కుమారుడు ఇంటర్మీడియెట్ చదువుతున్నారు. తల్లి కష్టపడి పిల్లలను చదివిస్తోంది. అనుమానం కారణంగా చంద్రమ్మ హత్యకు గురవడంతో చదువుకొంటున్న పిల్లల పరిస్థితి అగమ్యగోచరమైంది. అనుమానం, క్షణికావేశాలకు విచ్ఛిన్నమైన కుటుంబానికి ఈ కేసు ఓ ఉదాహరణ.

అత్యాశ..



భానోత్ గోపాల్... సొంత బావమరిది, మేనమామ చేతిలో దారుణంగా హత్యకు గురయ్యాడు. పాపన్నపేట మండలం లింగాయపల్లి సోమ్లు తండాకు చెందిన ఇతడు పదేళ్ల క్రితం అమీన్‌పూర్‌కు వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతడి పేరుమీద తన మేనమామ దేవీసింగ్, బావమరిది నరేశ్‌నాయక్‌లు జేసీబీను కొనుగోలు చేయించి బ్యాంకు రుణం తీసుకున్నారు. బీమాతో పాటు ఎల్‌ఐసీలో రూ.29లక్షల ప్రమాద బీమా సైతం చేయించారు. నామినీగా నరేశ్ నాయక్ పేరు నమోదు చేయించారు. గోపాల్ మరణిస్తే బీమా డబ్బులు వస్తాయని దురాశతో నరేశ్ నాయక్, దేవీసింగ్‌లు మద్యం తాగుదామని పిలిపించి గోపాల్‌ను గొంతు బిగించి హత్య చేశారు. అటు గోపాల్ హత్యతో అతడి కుటుంబం రోడ్డునపడటమే కాకుండా నరేశ్, దేవీసింగ్‌ల కుటుంబాలు జైలుపాలయ్యాయి. దురాశ దుఃఖానికి చేటు అనే సామెతకు ఈ కేసు ఓ ఉదాహరణ.

క్షణికావేశం... మృత్యుపాశం



కుటుంబాలు విచ్ఛిన్నం

- అనాథలవుతున్న చిన్నారులు

నారాయణఖేడ్/సంగారెడ్డి జోన్..

జిల్లాలో మూడేళ్లలో జరిగిన ఘటనలు			
ఘటనలు	2022	2023	2024
హత్యలు	41	53	55
ఆస్తికోసం హత్యలు	4	5	10
అత్యాచారాలు	77	48	131

జిల్లాలో ఇటీవలి కాలంలో ఇలాంటి ఘటనలు ఎన్నో వెలుగు చూస్తున్నాయి. నిరక్షరాస్యులతోపాటు చదువుకున్న వారు సైతం నేర ప్రవృత్తిని వీడటంలేదు. ఆవేశంలో చేసిన నేరాలతో ఇరువైపులా కుటుంబాలు విచ్ఛిన్నమైపోతున్నాయి. కేసులతో ఆర్థికంగా, సామాజికంగా కోలుకోలేని విధంగా కుటుంబాలు పతనమవుతున్నాయి. జిల్లాలో గతేడాది 55 హత్యలు చోటు చేసుకోగా అందులో 10 మర్డర్లు ఆస్తి కోసమే జరిగాయి. 131 అత్యాచారాలు చోటు చేసుకున్నాయి.

అవగాహన అవసరం

జిల్లాలో పదేళ్ల క్రితం వరకు మూఢనమ్మకాల నెపంతో దాడులు, హత్యలు చోటు చేసుకునేవి. నిరక్షరాస్యత కారణంగా గ్రామీణుల్లో మూఢనమ్మకాలు ఎక్కువగా ఉన్నాయని పోలీసుశాఖ గుర్తించి అప్పట్లో కళాజాత ప్రదర్శనలు జిల్లాలో నిర్వహించింది. గ్రామీణ ప్రాంతాలు, మూఢనమ్మకాల ఘటనలు చోటు చేసుకున్న గ్రామాల్లో కళాకారులు ప్రదర్శనల ద్వారా వివరిస్తూ గ్రామీణులకు అనుమానాలను నివృత్తి చేశారు. అక్షరాస్యత ఆవశ్యకత, అనారోగ్యాలకు గురైతే తీసుకోవాల్సిన చికిత్సల గూర్చి వివరించారు. చైతన్య కార్యక్రమాల ద్వారా జిల్లాలో మూఢనమ్మకాల ఘటనలు కనుమరుగయ్యాయి.

నేర ప్రవృత్తితో కుటుంబాలు చిన్నాభిన్నం

నేర ప్రవృత్తి కారణంగా చాలా కుటుంబాలు చిన్నాభిన్నం అయిపోతున్నాయి. క్షణికావేశమో.. అనుమానమో, దురాశో, హత్యలకు పాల్పడ్డ తర్వాత వారి కుటుంబాలతోపాటు బాధిత కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నాయి. హత్యలకు పాల్పడ్డ వారి పట్ల సమాజంలో ఒకరకమైన భయం కన్పిస్తోంది. వారితో సఖ్యతగా ఉండేందుకు చాలా మంది దూరంగా ఉంటున్నారు. చేసిన తప్పుకు కుమిలిపోయి ఆర్థిక, సామాజికంగా కుంగిపోతున్నారు. అలాంటివారి కుటుంబాలతో బంధుత్వాలకు వెనుకడుగు వేసే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రత్యక్షంగానో.. పరోక్షంగానో బాధితు లు, నిందితుల పిల్లలు, కుటుంబ సభ్యులు వేదననుభవించాల్సి వస్తోంది. నేరాల తర్వాత కుటుంబ పెద్ద జైలుపాలవడంతో ఆ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో రోడ్డున పడుతున్నాయి. పిల్లలు చదువులకూ దూరం అయిపోతున్నారు.

మంటగలుస్తున్న మానవ సంబంధాలు

ఏ చిన్న సమస్యనైనా అంతమొందించాలనే క్షణికావేశంతో మానవ సంబంధాలు మంటగలుస్తున్నాయి. ఇలా అవతలివారి ప్రాణం తీయడమే లక్ష్యంగా నేరాలకు పాల్పడుతున్నారు. క్షణికావేశం తమతోపాటు తమ వారికీ శాపంగా మారుతోంది.

అనుమానం పెనుభూతమై..

- భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్త
- కంగ్టి మండలంలో ఘటన

కంగ్టి(నారాయణఖేడ్): అనుమానం పెనుభూతమైంది. పైగా కుటుంబ కలహాలు.. ఇంకేం.. విచక్షణ కోల్పోయిన ఓ వ్యక్తి తన భార్యను గొడ్డలితో నరికి చంపాడు. ఈ ఘటన కంగ్టి మండలం తుర్కవడ్‌గామ్‌లో గురువారం తెల్లవారుజామున వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన హెబాశే గుండప్ప, చంద్రమ్మ(49) దంపతులు. వీరికి ఇద్దరు మగ, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. వీరిలో ఒక కుమార్తె వివాహం కాగా.. ముగ్గురు చదువు నిమిత్తం పట్టణాల్లో ఉంటున్నారు. గుండప్ప మద్యం తాగి తరచూ భార్యతో గొడవ పడేవాడు. దీనికి తోడు భార్యపై అనుమానం పెంచుకొని చంపుతానని పదే పదే మత్తులో హెచ్చరిస్తుండేవాడు. పలు మార్లు వీరి పంచాయితీ గ్రామపెద్దల వద్ద జరిగింది. అయితే.. గుండప్ప మద్యం మత్తులో మాట్లాడుతున్నాడని పెద్దమనుషులు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో గుండప్ప గురువారం ఇంట్లో తెల్లవారుజామున గొడ్డలితో భార్య తలపై నరికాడు. తీవ్ర గాయాలతో ఇంటి బయటకు వచ్చిన చంద్రమ్మ కిందపడి అక్కడే ప్రాణాలొదిలింది. స్థానికులు గుండప్పకు దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

హత్యలతో సమస్య పరిష్కారం కాదు



దురుద్దేశంతో ఒక వ్యక్తి మరొక వ్యక్తిని చట్టవిరుద్ధంగా చంపటమే హత్య. ఇటీవల ఇలాంటి నేరాలు పెరిగిపోతున్నాయి. హత్యలు చేయటంతో తమ సమస్యలు పరిష్కారం కావు. హత్య అనేది సంక్లిష్టమైన, బహుముఖమైన నేరమని గుర్తుంచుకోవాలి. మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకుంటే నేరాలోచనలు తగ్గడంతోపాటు నేరాలూ తగ్గుముఖం పడతాయి.

–డా.మొతుకూరి రాంచందర్,
మానసిక విశ్లేషకుడు, హైదరాబాద్

క్షణికావేశంలోనే ఘటనలు



క్షణికావేశంలో కొంతమంది తమకు తాము హాని చేసుకోవడంతో పాటు ఇతరులకు హాని తలపెడుతూ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. ఫలితంగా తమ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. పిల్లలు అనాథలుగా మారుతున్నారు. మారుతున్న ఆహారపు అలవాట్లు, పని ఒత్తిడి కారణంగా తొందరగా ఆవేశపడిపోతున్నారు. దీంతో అనేక అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. ఒత్తిడిని అధిగమించడానికి యోగ, పుస్తక పఠనం చేయాల్సిన అవసరం ఉంది.

–చెన్నూరి రూపేశ్, ఎస్పీ, సంగారెడ్డి

ఎల్‌ఆర్‌ఎస్‌పై మాట తప్పిన కాంగ్రెస్

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి: ఎల్‌ఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం అప్పుడో మాట ఇప్పుడో మాట మాట్లాడుతోందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ విమర్శించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉచిత ఎల్‌ఆర్‌ఎస్ అని చెప్పి ఇప్పుడు ఎందుకు డబ్బులు చెల్లించమంటుదని ప్రశ్నించారు. మార్చి 31 లోపు కడితే 25 శాతం రాయితీ వస్తుందని చెప్పి జనాలను మోసం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేకతకు భయపడే కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు తథ్యం

పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి



ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకులతో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షురాలు గోదావరి

జహీరాబాద్ టౌన్: రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు తథ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి తరఫున గురువారం జహీరాబాద్‌లో ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని పలు కళాశాలలను సందర్శించి పట్టభద్రులను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... యువత, ఉద్యోగులు బీజేపీ వైపే ఉన్నారని దీంతో అంజిరెడ్డి గెలుపు ఖాయమైందన్నారు. పోలింగ్ రోజు తప్పని సరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఆమె వెంట బీజేపీ నాయకులు జగన్నాథ్, పూల సంతోష్, గొల్ల భాస్కర్, నరేశ్ పాటిల్, శ్రీనివాస్ గుప్త తదితరులున్నారు.

నేడు తూప్రాన్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాక

మనోహరాబాద్(తూప్రాన్): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శుక్రవారం తూప్రాన్‌కు రానున్నారని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ తెలిపారు. అభ్యర్థి అంజిరెడ్డి తరఫున ప్రచారంలో పాల్గొంటారని.. అలాగే పలువురు పట్టభద్రులు, పార్టీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారని చెప్పారు. ఎంపీ రఘునందన్‌రావు, పలువురు ప్రముఖులు సైతం హాజరవుతారని వివరించారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

ట్రైనీ కలెక్టర్ మనోజ్



సమావేశంలో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ మనోజ్

సంగారెడ్డి జోన్: ప్రభుత్వం అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ట్రైనీ కలెక్టర్ మనోజ్ పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి బ్యాంకర్స్ కమిటీ (డీసీసీ) డీఎల్‌ఆర్‌సీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో డిసెంబర్ 2024 – 25 ఆర్థిక ఏడాదికి సంబంధించి వివిధ బ్యాంకుల ద్వారా అందజేసిన వ్యవసాయ, వ్యవసాయేతర రుణాల వివరాలు, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన యూనిట్లు, గ్రౌండింగ్ అయిన యూనిట్లు, మహిళా స్వయం సహాయక సంఘాలకు అందజేసిన రుణాలు, లక్ష్యాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మనోజ్ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాల కుటుంబాల్లో మార్పులు తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన యూనిట్ల గ్రౌండింగ్ పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువకులకు ప్రభుత్వ మంజూరు చేసిన స్వయం ఉపాధి పథకాలకు రుణాలు అందజేసి వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలన్నారు. కార్యక్రమంలో ఆర్బీఐ ఏజీఎం దేబోజిత్ బారువా, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ సూర్య ప్రకాశ్, యూబీఐ రీజినల్ మేనేజర్ వికాస్ కుమార్, నాబార్డ్ ఏజీఎం కృష్ణ తేజ, నాబార్డ్ ఎల్డీఎం గోపాల్‌రెడ్డి, సీఈవో జానకిరెడ్డి, పీడీఆర్‌డీవో జ్యోతి, పీడీ మెప్మా గీత సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

338మంది కార్మికులపై వేటు!

- సదాశివపేటలోని ఓ ప్రైవేటు టైర్ల పరిశ్రమ సంచలన నిర్ణయం
- ఆందోళనకు దిగిన కార్మికులను తొలగించిన యాజమాన్యం
- చర్చలు జరుపుతున్నాం: డిప్యూటీ కమిషనర్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: సదాశివపేట శివారులోని ఓ ప్రైవేటు టైర్ల పరిశ్రమ యాజమాన్యం సంచలన నిర్ణయం తీసుకుంది. తమను క్రమబద్ధీకరించాలంటూ ఆందోళనకు దిగిన 338మందికి పైగా కార్మికులపై వేటు వేసింది. ఈ ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నాలుగేళ్ల క్రితం యాజమాన్యం శిక్షణ పేరుతో నిరుద్యోగ యువతను ఉద్యోగాల్లోకి తీసుకుంది. అప్పట్నుంచి వీరిని పర్మినెంట్ చేయకుండా ట్రైనీగానే పనిచేయించుకుంటూ నెలకు రూ.14వేలు మాత్రమే చెల్లిస్తోంది. ఇన్నాళ్లు తక్కువ వేతనమిచ్చినా సర్దుకుపోయామని, తమను పర్మినెంట్ చేయాలంటూ ఆందోళనకు దిగడంతో సదరు పరిశ్రమ ఒక్కసారిగా వీరందరినీ ఉద్యోగాల నుంచి తొలగించింది. దీంతో ఆ కార్మిక కుటుంబాలన్నీ రోడ్డున పడ్డాయి. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వ శాఖ డీఆర్‌డీఏ (జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ) అప్పట్లో నిర్వహించిన జాబ్‌మేళాలో ఈ ఉద్యోగాలు పొందారు. నిబంధనల ప్రకారం ఒకటి రెండేళ్లకు మించి ట్రైనీగా కొనసాగించరాదు. నాలుగేళ్లుగా అరకొర వేతనాలతో ట్రైనీగా కొనసాగిస్తూ తమను శ్రమ దోపిడీకి గురి చేస్తోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

22న మరోసారి చర్చలు!

ఉద్యోగాలు పోయిన సుమారు 338 మంది కార్మికులు వారం రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. కార్మికశాఖ అధికారులకు కూడా వినతిపత్రాలు అందజేశారు. ఆ శాఖ అధికారులు ఇప్పటికే పలు మార్లు యాజమాన్యంతో చర్చలు జరపగా, కంపెనీ ప్రతినిధులు ఇంకా ఎటూ తేల్చడం లేదు. ఈ నెల 22న మరోసారి చర్చించాలని నిర్ణయించారు.

మరోసారిచర్చలు జరుపుతాం

సుమారు 338 మందికిపైగా ట్రైనీలను ఉద్యోగాల్లోంచి తొలగించడంతో సంబంధిత కంపెనీ యాజమాన్యంతో చర్చలు జరిపాం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 22న మరోసారి చర్చలు జరుపుతాం. ట్రైనీగా ఎన్ని రోజులు కొనసాగించాలనే దానిపై నిర్దీత నిబంధనలేవీ లేవు. చర్చలు ఫలించకపోతే లేబర్ కోర్టుకు రిఫర్ చేస్తాం.

–శ్రీనివాస్‌రెడ్డి, కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్

జాతరలో ప్లాస్టిక్ కనిపించొద్దు

మెదక్ అదనపు కలెక్టర్ నగేష్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

పాపన్నపేట(మెదక్): అధికారులు సమన్వయంతో పనిచేసి ఏడుపాయల జాతరను జయప్రదం చేయాలని అదనపు కలెక్టర్ నగేష్ పిలుపునిచ్చారు. గురువారం ఏడుపాయల్లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈనెల 26 నుంచి ప్రారంభమయ్యే జాతరకు సుమారు 10 లక్షలకు పైగా భక్తులు వస్తారని చెప్పారు. ఏ షాపులో ప్లాస్టిక్ కనిపించొద్దని ఆదేశించారు. ఇప్పటికే ప్లాస్టిక్ కవర్లు ఉంటే వాటిని తమకు అప్పగిస్తే బదులుగా పేపర్ కవర్లు ఇస్తామని సూచించారు. జాతర పరిసరాల్లో మరిన్ని శౌచాలయాలు ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ ప్రదేశాల నుంచి నడవలేని వ్యక్తుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. లడ్డూ, పులిహోర కేంద్రాల వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని చెప్పారు. ఆలయం వద్ద తొక్కిసలాట జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 24 వరకు ఏర్పాట్లు పూర్తి కావాలని ఆదేశించారు. సమావేశంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, డీఎల్పీఓ సురేష్ బాబు, ఈఓ చంద్రశేఖర్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎనిమిదేళ్ల చిన్నారిపై లైంగిక దాడి

సంగారెడ్డి టౌన్ : ఎనిమిదేళ్ల చిన్నారిపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఫసల్వాది గ్రామ సమీపంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పరిధిలో గురువారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. సాయంత్రం ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నారిని యువకులు మాయమాటలు చెప్పి పక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారు. చిన్నారి భయంతో కేకలు వేయడంతో స్థానికులు అక్కడకు చేరుకుని పాపను బయటకు తీసుకొచ్చారు. కాగా, యువకులిద్దరినీ పట్టుకునేందుకు ప్రయత్నించగా ఒకరు తప్పించుకున్నారు. పట్టుబడిన యువకుడికి స్థానికులు అక్కడే దేహశుద్ధి చేశారు. పాపను చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

- అలియా బేగం కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎస్పీ
- విద్వేషాలను రెచ్చగొట్టొద్దు



అలియాబేగం కుటుంబాన్ని పరామర్శిస్తున్న జిల్లా ఎస్పీ చెన్నూర్ రూపేశ్ కుమార్

మునిపల్లి(అందోల్)/సంగారెడ్డి జోన్: మునిపల్లి మండలం అంతారం గ్రామంలో ఓ ఖాళీ స్థలంలో మూత్రం పోసిందని సదరు స్థల యజమానులు చేసిన దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించిన టెన్త్ విద్యార్థి అలియా బేగం కుటుంబసభ్యులను జిల్లా ఎస్పీ రూపేశ్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులను ఓదార్చారు. కుటుంబానికి తాము అండగా ఉంటామని వారికి ధైర్యం చెప్పారు. ఈ కేసులో నిందితులను ఇప్పటికే అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించామని తెలిపారు. అలియా బేగంపై వారికి ఎలాంటి కక్షలేదని, కేవలం ప్రమాదవశాత్తు జరిగిన ఘటనగానే భావించాలన్నారు. విద్యార్థి మృతిపై సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టొద్దని, అలా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాజీయే రాజమార్గం

రాజీ పడటమే రాజమార్గమని, మార్చి 8న జరగనున్న జాతీయ లోక్–అదాలత్‌ను ఇరువర్గాలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ రూపేశ్ పేర్కొన్నారు. జిల్లాలోని పోలీసు అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు.

క్లుప్తంగా

అంతర్జాతీయ సదస్సుకు పరిశోధనా పత్రం ఎంపిక


మదన్‌మోహన్

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల సూక్ష్మజీవశాస్త్ర విభాగాధిపతి డా. మదన్‌మోహన్ పరిశోధనా పత్రం నేపాల్‌లో 24, 25 తేదీల్లో నిర్వహించనున్న అంతర్జాతీయ బయోటిక్నాలజీ సదస్సుకు ఎంపికైంది. ఈ సందర్భంగా గురువారం మదన్‌మోహన్ మాట్లాడుతూ.. మేడారం జాతర సమయంలో జంపన్న వాగు నీటి కాలుష్యంపై పుణ్యస్నానాల ప్రభావం అనే అంశం తీసుకొని తాను చేసిన పరిశోధనా పత్రాన్ని మన దేశం తరపున సదస్సులో ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, సీఓఈ డా. గోపాల సుదర్శనం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.మధుసూదన్, ఇతర అధ్యాపకులు మదన్‌మోహన్‌ను అభినందించారు.

అన్నీ ఉన్నా వృద్ధాశ్రమాలను ఆశ్రయించడం బాధాకరం

- జిల్లా జడ్జి స్వాతిరెడ్డి


వృద్ధులతో మాట్లాడుతున్న జడ్జి స్వాతిరెడ్డి

కొండపాక(గజ్వేల్): చట్టాలపై అవగాహన ఉంటే సుఖమయమైన జీవితాన్ని గడపవచ్చని సిద్దిపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా జడ్జి స్వాతిరెడ్డి పేర్కొన్నారు. కొండపాకలోని ఆనంద నిలయం, వృద్ధాశ్రమం, బాల సదనాన్ని గురువారం సందర్శించారు. లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. అంతకు ముందు వృద్ధాశ్రమంలో ఉండటానికి గల కారణాలు, ఇబ్బందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్వాతిరెడ్డి మాట్లాడుతూ.. వృద్ధాశ్రమాలు ఏర్పడటం కొంత వరకు సంతోషాన్ని, మరి కొంత వరకు బాధను కల్గిస్తాయన్నారు. అన్నీ ఉన్నా అనాథల్లా కొందరు వృద్ధాశ్రమాలను ఆశ్రయించడం బాధాకరమన్నారు. అనాథ పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు బాల సదనంను స్థాపించిన వారిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో లీగల్ సెల్ ఎయిడ్ కౌన్సిల్ కృష్ణమోహన్, ఎస్సై శ్రీనివాస్, వృద్ధాశ్రమ నిర్వహన ప్రతినిధులు పెద్ది వైకుంఠం, బెజగామ వెంకటేశం పాల్గొన్నారు.

కార్మికుల శ్రేయస్సే సీఐటీయూ లక్ష్యం

- రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్


మాట్లాడుతున్న మల్లికార్జున్

శివ్వంపేట(నర్సాపూర్): కార్మికుల శ్రేయస్సు సీఐటీయూ లక్ష్యమని, కార్మిక సంఘం ఎన్నికల్లో సీఐటీయూ నాయకులను గెలిపించాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే.మల్లికార్జున్ తెలిపారు. గురువారం మండలంలోని శభాష్‌పల్లి సమీపంలో గల సుగుణ ఫుడ్స్ పరిశ్రమలో గుర్తింపు ఎన్నికల సందర్భంగా కార్మికులతో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులను పర్మినెంట్ చేసిన ఘనత సీఐటీయూదే అన్నారు. గెలిపిస్తే పరిశ్రమల్లో కార్మికుల శ్రమ దోపిడీని అడ్డుకుంటామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడి కనీస వేతనాలు అమలయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఏ.మల్లేశం, నాయకులు యాదగిరి, మల్లాగౌడ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మనైనది.. అమ్మ భాష

- మాతృభాషను మించిన మరొక భాష లేదు
- కాపాడుకుంటేనే మనుగడ
- అభివృద్ధికి కృషి చేస్తున్న కవులు, రచయితలు

నేడు ప్రపంచ మాతృభాష దినోత్సవం


తెలుగుభాష అభివృద్ధికి కృషి చేస్తున్న కవులు, ఉపాధ్యాయులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మాతృభాషను మించి మరొక భాష లేదని చాలా మంది కవులు చెబుతుంటారు. నేటి ప్రపంచంలో దేశాల మధ్య, దేశ ప్రజల మధ్య సంబంధాలు ఎన్నో పెరిగాయి. చాలా మంది విదేశాలకు వెళ్లడానికి తపనపడుతున్నారు. అందుకు ఇంగ్లిషు నేర్చుకోవడం తప్పనిసరి అవుతుంది. దీంతో విద్యార్థులు తెలుగు భాషపై పట్టు కోల్పోతున్నారు. తెలుగు భాషను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని కవులు, కళాకారులు చెబుతున్నారు. మనం సమాజంలో ఎదిగేందుకు తల్లి ఎంత కృషి చేస్తుందో, అదే విధంగా మాతృభాష కూడా మన ఆహా భావాలు సరైన రీతిలో వ్యక్తపర్చటానికి తల్లిలా దోహదపడుతుంది. మాతృభాష తెలుగును జిల్లాలోని తెలుగు భాషా పండితులు, అదేవిధంగా కవులు అన్ని విధాలుగా ముందుకు తీసుకెళ్తున్నారు. ముఖ్యంగా మన భాష, యాసను కాపాడటానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు. నేటి ఆధునిక కాలంలో ప్రతీ తల్లిదండ్రులు తమ పిల్లలు ఇంగ్లిష్ మీడియంలో విద్యనభ్యసించాలని, ఇతర దేశాల్లో ఉద్యోగాలు చేయాలని తహతహలాడుతు, మన మాతృభాష రాకున్న ఫర్వాలేదు కాని ఇంగ్లిష్ రావాలనే తపనలో ఉన్నారు. దీంతో నేడు విద్యనభ్యసిస్తున్న అనేక మంది విద్యార్థులకు అటు ఇంగ్లిష్, ఇటు తెలుగు సక్రమంగా రాయడం, చదవడం రాని పరిస్థితులు నెలకొన్నాయి. ఇతర భాషలు నేర్చుకోవడంలో తప్పు లేదు, కానీ మాతృభాషను విస్మరించడమే తప్పు.



తెలుగు భాషాభివృద్ధికి కృషి

జిల్లాలోని అనేక మంది తెలుగు భాష పండితులు తాము వృత్తిరీత్యా పాఠశాలలో విద్యార్థులకు విద్యను బోధిస్తూనే తీరిక సమయంలో కవితలు, రచనలు రాస్తూ పుస్తకాల రూపంలో వెలువరించటం ద్వారా జిల్లాలో సాహితీ అభిమానులు తమ పిల్లలకు మాతృభాషపై పట్టు సాధించేలా దృష్టి సారిస్తున్నారు. సాయంత్రం సమయాల్లో ఉపాధ్యాయులు, కవులందరూ కలిసి కవి సమ్మేళనాలు, అష్టావధానాలు, తదితర ప్రక్రియలతో తెలుగు భాషాభివృద్ధికి తోడ్పాటునందించే విధంగా కార్యాచరణ అమలుపరుస్తున్నారు. జిల్లాలోని అనేక మంది ఉపాధ్యాయులు తెలుగు భాషలో బోధన చేస్తూ గుర్తింపు పొందారు. ఇందులో ముఖ్యంగా నాడు నందిని సిధారెడ్డి నుంచి మొదలుకొని నేటి వరకు అనేక మంది పాత, కొత్త తరం కవులు, రచయితలు జిల్లాలో తెలుగుభాషాభివృద్ధికి కృషి చేస్తున్నారు.

మాతృభాషను విస్మరించొద్దు



మనలో ఉన్న భావాలను స్వేచ్ఛగా అందించేది మన మాతృభాష. అలాంటి ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అనే పేరు ప్రఖ్యాతి గాంచిన తెలుగు అజరామరం. బాలలైన వృద్ధులైన నేడు సిద్దిపేట సాహితీ లోకంలో విహరిస్తూ మాతృభాష కృషికి బాటలు వేస్తున్నారు. ఇద ఆహ్వానించదగిన విషయం. మాతృభాష అభివృద్ధి చెందాలంటే మన పిల్లలకు తెలుగు నేర్పడంలో మనం చొరవ తీసుకోవాలి. ఇతర భాషలను గౌరవిస్తూనే, మన మాతృభాషను విస్మరించొద్దు. ఇప్పటికి జిల్లాలో మాతృభాష అభివృద్ధికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– ఉండ్రాళ్ల రాజేశం, బాలసాహితీవేత్త, సిద్దిపేట

మానవ సంబంధాలను ముడి వేస్తుంది



మాతృభాష చక్కని మాధుర్యానికి, పలుకుబడులకు, నుడికారాలకు పుట్టినిల్లు. మాతృభాష మమకారం మానవ సంబంధాలను ముడివేస్తుంది. నేడు అనేక మంది తమ కుటుంబాల్లో ఇతర భాషల్లో మాట్లాడుతున్నారు. దీంతో చిన్నారులకు ఇటు తెలుగు, ఇతర భాషలు పూర్తి స్థాయిలో మాట్లాడలేకపోతున్నారు. కేవలం మాతృభాష దినోత్సవం నాడే కాకుండా ప్రతి రోజూ మన మాతృభాష అభివృద్ధికి ముందుకు సాగాలి. మన మాతృభాషను కాపాడుకోవటం అందరి బాధ్యత. ఇతర భాషలు నేర్చుకున్నప్పటికీ మన భాషను విస్మరించద్దు.

–భామండ్ల రాజు, తెలుగు అధ్యాపకులు, సిద్దిపేట

గుర్తు తెలియని ఇద్దరు మహిళలు మృతి

సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రి వద్ద గుర్తింపు

సంగారెడ్డి క్రైమ్: సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. గురువారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ప్రభుత్వాస్పత్రిలోని అత్యవసర ద్వారం వద్ద గుర్తు తెలియని మహిళ అపస్మారక స్థితిలో పడ్డి ఉంది. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. ప్రభుత్వాస్పత్రి ఆవరణలో గల పలు దుకాణాల్లో భిక్షాటన చేసే మహిళగా పోలీసులు గుర్తించారు. మృతురాలి వయసు 50 నుంచి 52 ఏళ్ల వరకు ఉంటుందని తెలిపారు. సెక్యూరిటీ గార్డు కల్వగూరి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు తెలిస్తే 87126 56718 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. అలాగే మరో గుర్తు తెలియని మహిళ మృతి చెందిందని, ఆమె వయసు 45 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందని తెలిపారు. సెక్యూరిటీ ఇన్‌చార్జి జాన్.డీ శాన్‌టిస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

10 ఎకరాల తోట దగ్ధం


తోటలో చెలరేగుతున్న మంటలు

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రమాదవశాత్తు నిప్పంటుకొని తోట దగ్ధమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గోనెపల్లి గ్రామవాసి కూర మాధవరెడ్డికి చెందిన నీలగిరి తోటలో బుధవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలార్పారు. అప్పటికే 10 ఎకరాల తోట దగ్ధమైంది. సుమారు రూ. 5 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వ పరంగా నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

హత్య కేసులో భార్య, అల్లుడు రిమాండ్


నిందితులను చూపుతున్న పోలీసులు

పాపన్నపేట(మెదక్): ఆశయ్యను హత్య చేసిన కేసులో నిందితులైన అతడి భార్య శివ్వమ్మ, అల్లుడు రమేశ్‌ను గురువారం రిమాండ్‌కు తరలించినట్లు మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి,పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఆశయ్య శనివారం పొలం వద్ద జారి పడగా కాలు విరిగింది. ఆపరేషన్‌కు అయ్యే ఖర్చు భరించలేక, ఆపరేషన్ చేసినా నడిచి పొలం పనులు చేయలేడనే అనుమానంతో భార్య, అల్లుడు కలిసి ఆదివారం రాత్రి ఆశయ్యను ఉరేసి హత్య చేసిన విషయం తెలిసిందే. కేసులో భాగంగా ఇద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు వివరించారు.

గురక తగ్గడం కోసం సర్జరీ

- మరుసటి రోజే వ్యక్తి మృతి
- వైద్యం వికటించి చనిపోయాడంటూ కుటుంబికుల ఆందోళన
- సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఘటన


శ్రీనివాస్ (ఫైల్)

సంగారెడ్డి: వైద్యం వికటించి వ్యక్తి మృతి చెందిన ఘటన సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కొండాపూర్ మండలం గారకుర్తి గ్రామానికి చెందిన వెల్మరి శ్రీనివాస్(47) నిద్రలో గురక బాగా వస్తోందని సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించాడు. వైద్యులు పరీక్షించి ముక్కులో బోన్ పెరిగిందని ఆపరేషన్ చేస్తే గురక తగ్గుతుందని చెప్పారు. దీనికి శ్రీనివాస్ ఒప్పుకోవడంతో బుధవారం సర్జరీ చేశారు. సర్జరీ అనంతరం రాత్రి శ్రీనివాస్ గుండెపోటుతో చనిపోయాడని కుటుంబ సభ్యులకు డాక్టర్లు చెప్పారు. ఇప్పటి వరకు ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి ఎలా చనిపోతాడని డాక్టర్లను నిలదీశారు. గురువారం ఉదయం మృతుడి బంధువులు న్యాయం చేయాలని ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు వచ్చి పరిస్థితిని అదుపుజేశారు. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రమేశ్ కుమార్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


బేతప్ప మృతదేహం

జహీరాబాద్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని అల్గోల్ గ్రామంలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఏర్పుల బేతప్ప(36) బుధవారం రాత్రి గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో కలిసి దుకాణానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో తూలి కిందపడి తీవ్రంగా గాయపడినట్లు మృతుడితోపాటు ఉన్న వ్యక్తి పోలీసులు తెలిపాడు. గాయపడిన బేతప్పను రాత్రి వైద్యం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. భార్య స్వప్న మాత్రం బేతప్ప మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వ్యాపారినని నమ్మించి

– రూ. 67,400 కాజేసిన వ్యక్తి

రామాయంపేట(మెదక్): ఆన్‌లైన్‌లో తక్కువ ధరకే శానిటరీ వస్తువులు ఇస్తామని వ్యాపారిని నమ్మించి మోసం చేశాడో ఓ వ్యక్తి. ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన దోమకొండ రాములుకి శానిటరీ దుకాణం ఉంది. అతడికి ఆన్‌లైన్‌లో ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. తక్కువ ధరకే శానిటరీ వస్తువులు ఇప్పిస్తానని మభ్యపెట్టి విడతల వారీగా రూ.67,400 ఖాతాకు బదిలీ చేయించుకున్నాడు. మరి కొన్ని డబ్బులు వేయాలని పదే పదే ఒత్తిడి చేశాడు. దీంతో అనుమానం వచ్చి రాములు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

దుర్గమ్మ సేవలో నటుడు పూరి ఆకాశ్


ఆలయంలో ఆకాశ్

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల దుర్గమ్మను ప్రముఖ చలన చిత్ర దర్శకుడు పూరి జగన్నాథ్ తనయుడు, నటుడు ఆకాశ్ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆలయ చరిత్రను వివరించారు.

సూచిక కమాన్‌ను ఢీకొట్టిన డీసీఎం

కారుపై పడిపోవడంతో ఇద్దరికి గాయాలు


రోడ్డుపై పడిపోయిన కమాన్

తూప్రాన్, మనోహరాబాద్(తూప్రాన్): రోడ్డుపై ఏర్పాటు చేసిన సూచిక కమాన్‌ను డీసీఎం ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం మండలంలోని రామాయపల్లి శివారులో అదుపుతప్పి సూచిక కమాన్‌ను ఢీకొట్టింది. అదే సమయంలో ఒంగోలుకు చెందిన ప్రశాంత్ గణేశ్, మిత్రురాలు ప్రత్యూషతో కలిసి స్నేహితుడి వివాహం కోసం కామారెడ్డి వెళ్తున్నారు. అడ్రస్ కోసం రోడ్డు పక్కన కారు నిలిపి మ్యాప్ చూస్తున్నారు. డీసీఎం ఢీకొట్టగా కమాన్ ఒరిగి వీరి కారుపై పడిపోయింది. ప్రత్యూషకు, డీసీఎం డ్రైవర్ మహ్మద్ అలీంకు గాయాలయ్యాయి. కారు యజమాని గణేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తూప్రాన్ ఎస్‌ఐ శివానందం తెలిపారు.


కళాశాలలో ఎలక్ట్రిక్ బగ్గీల వద్ద విద్యార్థులు

డిజిటల్ ఇంజనీరింగ్‌కు ప్రోత్సాహం

- రెనాల్ట్ గ్రూప్ హెచ్‌ఆర్ వైస్ ప్రెసిడెంట్ సిమోనా అడెలీనా
- బాహ సే ఇండియా–2025 పోటీలు

నర్సాపూర్ : ప్రపంచ వ్యాప్తంగా తమ సంస్థ డిజిటల్ ఇంజనీరింగ్‌కు ప్రోత్సాహాన్ని అందిస్తుందని రెనాల్ట్ గ్రూప్ (ఆసియా) హెచ్‌ఆర్ వైస్ ప్రెసిడెంట్ సిమోనా అడెలీనా అన్నారు. గురువారం బీవీ రాజు ఇంజనీరింగు కాలేజీలో జాతీయ స్థాయి ఈ బాహ సే ఇండియా–2025 పోటీలు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా సిమోనా అడెలీనా హాజరై మాట్లాడారు. డిజిటల్ ఇంజనీరింగ్‌కు తమ సంస్థ అందజేస్తున్న ప్రోత్సాహాన్ని ఆమె వివరిస్తూ ఇంటర్న్‌షిప్, ఉపాధి అవకాశాలు అందజేసే ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సొసైటీ ఆఫ్ ఆటోమోటివ్ ఇంజనీర్స్ ఇండియా (ఎస్ఏఈ) చైర్మన్ బాల్‌రాజ్ సుబ్రమణ్యం, బాహ సే ఇండియా సలహాదారుడు డాక్టర్ కేసీ వోరా, విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవి చంద్రన్ రాజగోపాల్, ఆటోకార్ ప్రొఫెషనల్ అసిస్టెంట్ ఎడిటర్ మయాంక్ డింగ్రా, బీపీసీఎల్ హైదరాబాద్ టెరిటరీ మేనేజర్ శ్రావణ్ కుమార్, ఈ బాహ సే ఇండియా జాయింట్ కన్వీనర్ మనోనిత్ సింగ్, తదితరులు పాల్గొని తమ సంస్థలకు ఈ బాహతో ఉన్న సంబంధాలను వివరించారు. విద్యార్థులనుద్దేశించి సొసైటీ చైర్మన్ విష్ణురాజు పంపిన వీడియో మేసేజ్‌ను వినిపించారు. ఐదు రోజులపాటు కార్యక్రమం జరుగుతుందని, 15 రాష్ట్రాల నుంచి 80 జట్లు పాల్గొన్నాయని కాలేజీ డైరెక్టర్ లక్ష్మిప్రసాద్ తెలిపారు. ఇందులో కాలేజీ ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, ఆయా బ్రాంచ్‌ల హెచ్‌ఓడీలు, ఇతర ప్రతినిధులు బాపిరాజు, సురేశ్, కాంతారావు, రాయుడు, దశరథరామయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలకు పాల్పడుతున్న బీఆర్‌ఎస్

దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

నర్సాపూర్ : అధికారం కోల్పోవడంతో బీఆర్‌ఎస్ నాయకులు కేటీఆర్, హరీశ్‌రావు హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నారని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం నర్సాపూర్‌కి వచ్చి విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అవినీతిని ప్రశ్నించినందుకు లింగమూర్తి అనే వ్యక్తిని బీఆర్‌ఎస్ నాయకులు హత్య చేయించారని, స్వయాన మృతుడి కూతురు బీఆర్‌ఎస్ నాయకులపై ఆరోపణలు చేసినట్లు గుర్తు చేశారు. అధికారం అడ్డం పెట్టుకొని బీఆర్‌ఎస్ నాయకులు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు అడ్డగోలుగా దోచుకున్నారని ఆరోపించారు. ప్రజల ఆస్తులను కాపాడేందుకు ప్రయత్నించే వ్యక్తులను చంపడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. నీళ్లు నిధులు, నియామకాలపై ప్రత్యేక తెలంగాణ ఉద్యమం సాగిందని అవన్నీ కేసీఆర్ కుటుంబానికే దక్కాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించేందుకు పార్టీ నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కోరారు. ఆయన వెంట పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, తదితరులు ఉన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ చెన్నూరి రూపేశ్

- వివిధ ఫార్మా కంపెనీల నుంచి పల్లాడియం కార్బన్ చోరీ
- వివరాలు వెల్లడించిన పోలీసులు

సంగారెడ్డి జోన్: కొన్నేళ్లుగా పల్లాడియం కార్బన్ దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగలను జిల్లా పోలీసులు అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన వివరాలను జిల్లా ఎస్పీ రూపేశ్ గురువారం మీడియాకు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా పరిధిలోని మసీద్‌పురం గ్రామానికి చెందిన అల్లం సాంబశివుడు హైదరాబాద్‌లోని సూరారంలో ఉంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. గతంలో పుణెలోనూ, సంగారెడ్డిజిల్లాలోనూ పలు ఫార్మా కంపెనీల్లో పనిచేయడం వల్ల అతడికి బహిరంగ మార్కెట్‌లో భారీగా ధర పలికే పల్లాడియం కార్బన్ గురించి అవగాహన ఉంది. పల్లాడియం కార్బన్‌ను అమ్ముకుని భారీగా డబ్బులు సంపాదించాలనే లక్ష్యంతో చోరీ మార్గాన్ని ఎంచుకున్నాడు. ఇందుకు పుణె ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నప్పుడు పరిచయమైన ప్రసాద్‌తో పాటు ఆదిత్య అంకుష్ మన్నె, ముక్కంటి రెడ్డి, మట్టాకుటుంబరావు, గుమ్మడి శ్రీనివాస్‌రావుతో కలసి ఓ ముఠాను తయారు చేశాడు. అందరూ కలసి ఫార్మా కంపెనీల్లో నిల్వ ఉంచే పల్లాడియం కార్బన్‌ను దొంగిలించేవారు.

హెచ్ ఆర్ మేనేజర్ ఫిర్యాదుతో..

ఈ నెల 8న సదాశివపేట పరిధిలోని యావాపూర్ గ్రామ శివారులోని అరీన్ లైఫ్ సైన్సెస్ యూనిట్–3 కంపెనీలో పల్లాడియం కార్బన్ దొంగతనం జరిగింది. దీనిపై ఆ సంస్థ సీనియర్ హెచ్‌ఆర్ మేనేజర్ మజ్జి సూరప్పల నాయుడు సదాశివపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు సాంకేతిక సమాచారం, సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టి బుధవారం మద్దికుంట చౌరస్తాలో ఆరుగురు నిందితుల్ని పట్టుకున్నారు. వారి నుంచి 96 కిలోల పల్లాడియం కార్బన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సాంబశివుడు ముఠా గతంలో జిల్లాలోని బొంతపల్లి, బీదర్ ఫార్మా కంపెనీలలో కూడా మొత్తంగా 120 కేజీల పల్లాడియం కార్బన్‌ను దొంగిలించినట్లు విచారణలో వెల్లడైంది. బహిరంగ మార్కెట్‌లో దీని విలువ సుమారు రూ.4.50కోట్లు ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. నిందితులను గురువారం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. కేసు త్వరితగతిన ఛేదించిన సదాశివపేట ఇన్‌స్పెక్టర్ మహేశ్‌గౌడ్, సీసీఎస్, ఇన్‌స్పెక్టర్ శివకుమార్, కొండాపూర్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్, పి.రామునాయుడు ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐ శ్రీకాంత్, కొండాపూర్ ఎస్సై హరిశంకర్ గౌడ్ సిబ్బందిని అభినందించారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

నిందితులను పట్టుకున్న లింగారెడ్డిపేట్ గ్రామస్తులు

మనోహరాబాద్(తూప్రాన్): మనోహరాబాద్ మండలంలోని లింగారెడ్డిపేట్ గ్రామ శివారులో హైదరాబాద్‌కు చెందిన కొందరు వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు చేస్తుండగా గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. బుధవారం గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో ఐదుగురు మగవారు, ఓ మహిళ కలిసి గుప్త నిధుల కోసం పూజలు చేసి తవ్వకాలు చేపట్టారు. ఇది గమనించిన ఓ రైతు గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో వెళ్లి పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చి అప్పజెప్పారు. ఈ విషయంపై ఎస్‌ఐ సుభాష్‌గౌడ్‌ను వివరణ కోరగా నిజమేనని విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

యువకుడి దారుణ హత్య

- సిద్దిపేట పట్టణంలో ఘటన
- పరిశీలించిన ఏసీపీ మధు, సీఐ ఉపేందర్


శ్రీను (ఫైల్)

సిద్దిపేటకమాన్: గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో వ్యక్తి హత్యకు గురైన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం ప్రకారం.. సిద్దిపేట పట్టణం డబుల్ బెడ్రూం ఇళ్లలో నివాసం ఉంటున్న బోదాసు శ్రీను (29)కు సంధ్యతో 2014లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పని నిమిత్తం భార్య సంధ్య పిల్లలతో హైదరాబాద్‌లో ఉంటుండగా శ్రీను సిద్దిపేటలోని డబుల్ బెడ్రూం ఇళ్లలో ఉంటున్నాడు. పట్టణంలోని నర్సాపూర్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న ఇంటిలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శ్రీనుపై దాడి చేసి హత్య చేశారు. గురువారం తెల్లవారుజామున ఇంటి యజమాని మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న సిద్దిపేట ఏసీపీ మధు, సీఐ ఉపేందర్ మృతదేహాన్ని పరిశీలించి, చుట్టుపక్కల వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటనా స్థలంలో డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ సిబ్బంది వేలి ముద్రలు సేకరించారు. మృతుడికి నేర చరిత్ర ఉందని, అతడిపై పలు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. శ్రీను తలపై రక్తపు గాయాలు ఉండడంతోపాటు ఘటనా స్థలంలో కర్రను స్వాధీనం చేసుకున్నారు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


పరిశీలిస్తున్న ఏసీపీ మధు, సీఐ ఉపేందర్